# చిరంజీవి 'మమత'

> "మీరు మాత్రమే వ్రాయగల కథ 'చిరంజీవి మమత.'
> చదివాను... చాలా ఆనందించాను.
> - డా॥ మల్లెమాల వేణుగోపాలరెడ్డి ( కడప )

నేనేమంత నోరూవాయీ లేనిదాన్ని కాదు. నా కథని నేనే చెప్పుకుంటాను...

ఇప్పుడు నా మనసేమీ బాగాలేదు. ఏదేదో మాట్లాడి ఆఫీస్‌కి వెళ్లిపోయాడు రాజేష్. అతని మాటలన్నీ 'పాలిష్‌డ్'గా వుంటై! "నీ మూర్ఖత్వం అన్ని సందర్భాల్లోనూ నన్ను ఇబ్బందుల్లోకి తోస్తూనే వుంది" అనికదా వెళ్తూ వెళ్తూ తానన్నది? అవును.

అన్ని సందర్భాలు..! ఎన్ని సందర్భాలు? ఎన్ని సంఘటనలు..? ఎన్ని సంభవాలు..?

ఆరేళ్ల క్రితం మొదలు... పెళ్ళి కాగానే యు.ఎస్. కాపురం. ఇద్దరమూ ఉద్యోగాల్లో కుదురుకున్నాం. పిల్లల్ని గురించిన ఆలోచనలు... "నాకు కెరీర్ ముఖ్యం. ఇప్పట్లో అట్టాంటి ఆలోచనలు చెయ్యకు!" అన్నాడు.

"నీ ఆలోచనలు మాత్రమేనా? నా ఆలోచన అవసరమే లేదా? నిర్ణయం నీదా, నాదా, మనదా?" అని అడిగాను. ఇదీ నా మూర్ఖత్వం!

నా ప్రశ్నకి విస్తుపోయాడు. నాలుగురోజులు మౌనం. నెలరోజులు కోల్డ్‌వార్ సాగింది. చివరికి ఒకరోజు నేనే మామూలైపోయాను.

ఆ చల్లని వేళలో "అట్టాగేలెండి... మీరన్నట్టే చేద్దాం!" అని దరహసించాను.

మొహం చాటంతయింది. నా చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా, ప్రేమగా నొక్కాడు.

రెండేళ్ల తర్వాత... జాగ్రత్తలు మర్చిపోయి ప్రవర్తిస్తుంటే, ఇప్పుడింక ఇష్టమే కాబోలనుకున్నాను. నేనూ ఎంకరేజ్ చేశాను. నెల తప్పింది.

ఆ శుభవార్తని ఆనందంగా చెవినేస్తే- ఆముదం తాగిన మొహం పెట్టాడు.

ఆ వెంటనే "యూ డోన్ట్ హావ్ టైమ్‌సెన్స్. జీవితంలో ప్లానింగ్ లేకపోతే అధోగతే!" అని లెసన్ పీకాడు. నా కళ్ళలోకి సూటిగా చూసి చెప్పలేక దిక్కులు చూస్తూ "ఎబార్షన్ చేయించుకో!" అన్నాడు. రోషాలూ, కోపాలూ రేగినై. ఘర్షణ పడ్డాం.

"నిర్ణయం నీదా? నాదా?" అన్నాను. ఇదీ మూర్ఖత్వం.

కుతకుతలాడిపోయాడు. చిన్నతనంనుంచీ తానెంత దురదృష్టవంతుడో వర్ణించేడు. ఎంత నోరూ వాయీ వున్న దాన్నే అయినా మాటల యుద్ధానికీ ముగింపు తప్పదు కదా. చివరికి దినసరి పోరు భరించలేకా, మానసిక హింసకి చుక్క పెట్టేద్దామని- నా యిష్టానికి విరుద్ధంగా బల్ల ఎక్కాను.

రాజేష్‌కి గొప్ప రిలీఫ్. ఎంతో హాయి. పువ్వుల్లో పెట్టుకుని చూసుకున్నాడు. ఆహారంలో, విహారంలో నా మనసు తెలుసుకుని సంతోషపెట్టేవాడు. ఉన్నట్టుండి వో వీకెండ్- న్యూయార్క్ నుండి నయాగరా ప్రయాణం పెట్టాడు.

నేనూ చాలా ఆనందించాను. మరో పక్కన, "ఏఁవిటీ మనిషి- పూర్తిగా అర్థం కాడేం?" అనీ అనిపించేది. ఆ తర్వాత ఏడాదికి- మా అత్తామామా అమెరికా వచ్చారు.

అత్తమ్మ ఘోష మొదలైంది. సాధింపు సాగింది. రాద్ధాంతం పెరిగింది -

"ఇరవై ఎనిమిదేళ్లొచ్చేయ్ శరీరం మీదికి. పిల్లా పీతుకూ లేకుండా ఎన్నాళ్లుంటా విట్టా? ఏ వయస్సులో జరగాల్సిన ముచ్చట ఆ వయస్సులో జరగాలి. పిల్లలు వద్దనుకుని టింగురంగా అంటూ ఆ జీన్సూ, టీషర్ట్‌లూ తొడుక్కుని ఏ అర్ధరాత్రో, అపరాత్రో వచ్చి అట్టాగే బెడ్‌మీద వాలిపోతే... ఆడతనమేం కావాలి? మొగుడన్నవాడికి 'ఆ అవసరం' లేకుండా చేస్తే, ఆ తర్వాత కడుపు పండలేదని బతుకంతా ఏడుస్తూ కూచోవాలి."

"ఒంటికాయ్, శొంఠికొమ్ములా ఎన్నేళ్లు తిరుగుతావ్? చదువూ, ఉద్యోగం వుంటే చాలా? ఆడపిల్ల క్కావాల్సిన తెలివితేటలఖ్ఖర్లా?" ఇలా వుండేవి ఆమె మాటలు. మనసు నొచ్చుకునేది. ఖాళీగా, రికామీగా కనిపిస్తే చాలు- రాజేష్ ఎంత మంచివాడో, ఎంత బుద్ధిమంతుడో సర్టిఫికెట్ల లిస్ట్ చెప్పేది.

ఆ వేళ రాత్రి-

అందరమూ కలిసి భోజనాలు చేశాం. టీ.వీ. నడిచింది. చుట్టాల కబుర్లు సాగినై.

పదకొండు గంటలయింది. 'గుడ్‌నైట్' చెప్పి మా గదిలోకి పోబోతుంటే... ఉన్నట్టుండి- "సరే, వెళ్లి పడుకోండి. రేపు మళ్లీ ఉద్యోగం యుద్ధం కదా!" అని మరుక్షణం నావైపు చూస్తూ "కరుణా... తలుపేసుకోగానే నిద్రలోకి జారకు!" అని అదోలా వెటకారం చేసింది. నాకు నెత్తిమీద బండరాయిని పెట్టి కొట్టినట్టనిపించింది. ఠక్కున అనేశాను-

"చివరికిట్టా గూడా రిమైండ్ చేస్తున్నారా... మేమేం పసిపిల్లలం కాదు."

బెడ్‌రూమ్‌లో చాలాసేపు రాజేష్‌తో ఈ విషయం మీదే చర్చ! మాటా మాటా పెరిగింది. తల్లి చెప్పేదాంట్లో అంత పెద్ద తప్పేం లేదంటాడు రాజేష్. ఎడమొహం, పెడమొహంతోనే రాత్రి గడిచింది.

మర్నాడు రాత్రి –

రాజేష్ సమక్షంలోనే తన 'పాయింట్'ని చెప్పింది మా అత్తమ్మ. నేను నా ప్రశ్నని ఇద్దరికీ కలిపి సంధించాను... "నిర్ణయం మీదా, నాదా అసలు?" అని.

ఇద్దరూ గింజుకున్నారు. పెద్ద రాద్ధాంతమే జరిగింది. మావగారెప్పుడూ స్విట్జర్లాండ్ లాంటి మనిషి, తటస్థ దేశం పాత్ర!

ఆ మర్నాడు –

"నా మాటకి గడ్డిపోచంత విలువ కూడా లేనిచోట నేనుండలేను..." అని ఇండియాకి ప్రయాణమైంది ఆమె. విధిలేక భార్యని అనుసరించాడు మావయ్య.

వాళ్ళిద్దరూ వెళ్లినరోజు నుంచీ– రాజేష్ ప్రవర్తనలో వింత మార్పు వచ్చింది. ప్రతి దానికీ విసుగూ, చిరాకూ. ఏది అడిగినా "నీ యిష్టమొచ్చినట్టు చెయ్. నీ మూర్ఖత్వంతో ప్రాణం తీస్తున్నావ్!" అని పక్కకి పోవటం...

"మూణ్ణెల్ల ముందరే మావాళ్ళని తిరిగి వెళ్లేట్టు చేశావ్– ఘటికురాలివి!" అంటూ నిష్ఠూరం, దెప్పిపొడుపూ.

ఒకరోజున పని గట్టుక్కూచుని చర్చ లేవదీశాడు –

"నీకేంవిటీ ఇప్పుడు అబ్జెక్షన్?" అని. దేనికి? పిల్లల్ని కనటానికి! మాట తీయగా మాట. ఆవేశం, ఉద్రేకం. ఇద్దరికీ నోరూవాయీ ఉన్నై కదా! నా మనసులో ఏదో పెద్ద విస్ఫోటమే జరిగింది.

మళ్లీ అదే ప్రశ్నని అడిగేశాను– "అంటే... మీ అమ్మకీ, మీకూ యిష్టమైనప్పుడు నేను పిల్లల్ని కనాలన్నమాట?" అని. అదీ నా మూర్ఖత్వం!

"విషయాల్ని కెలికి కెలికి ప్రాణం తీయటమే నీకిష్టం!" అన్నాడు.

"కాదు. మీరు గుచ్చే గుండుసూదుల్ని పీక్కోకుండా, లెక్కపెట్టుకోకుండా వదిలేయాలి."

"నీకేదో పిచ్చి పట్టింది. ఏమేమిటో మాట్లాడుతున్నావ్!"

"అవును... పిచ్చే! కానీ, ఆ పిచ్చి పట్టించింది మాత్రం మీరే! మీ మాటనీ, మీ అమ్మ మాటనీ నేను ఆనర్ చేయాలని మీ కోరిక. మీ నిర్ణయాల్ని అమలుచేస్తూ వుంటే నేను బుద్ధిమంతురాలిని. మీకు కావల్సింది అంతే. నేనెట్టా చచ్చినా ఫర్వాలేదు."

నా కంఠస్వరంలోని ఎగుడుదిగుళ్ళూ, ఉద్రేకమూ నాకు తెలుస్తూనే వున్నై.

"అంటే..? అంటే... ఏమిటి నువ్వనేది?" అడిగాడు.

"అంటే... నేను ఎనిమిక్‌గా వున్నాననీ, నా ఆరోగ్యం బాగాలేదనీ డాక్టర్ చెప్పిన సంగతి మీకు గుర్తుండదు?!" నాకు ముక్కుపుటా లదిరి ఏడుపొచ్చింది. మనసులో కల్లోలం కంటినీళ్లల్లో తిరిగింది.

మౌనంగా వుండిపోయాడు రాజేష్. నేనూ ఏమీ మాట్లాడలేదు. కొద్ది సమయం గడిచింది. నాలో అలజడి అలాగే వుంది. దుఃఖాన్ని పళ్ల బిగువున ఆపుకుని కూచున్నాను.

రాజేష్ లేచి నెమ్మదిగా నా దగ్గరకు వచ్చాడు. పక్కగా కూచున్నాడు. భుజం మీద చేయి వేశాడు. లాలనగా నిమిరాడు.

"కూల్ డౌన్ కరుణా! ఇట్స్ ఓకే! అన్నీ సర్దుకుంటాయ్. ఇప్పుడేమయిందనీ? రా... నువ్ రెస్ట్ తీసుకో!" అని నన్ను పొదివి పట్టుకుని బెడ్‌రూమ్‌కి నడిపించుకు వెళ్లేడు.

ఫలితం లేని ఆలోచనలతోనే రాత్రి గడిచింది.

రాజేష్ తన తల్లిని సపోర్ట్ చెయ్యటం, మళ్లీ ఇప్పుడిలా ఏమీకాలేదని అనునయించటం... ఆలోచిస్తున్నకొద్దీ 'చిత్రమైన మనిషి' అనిపించసాగింది.

రోజులు గడుస్తున్నాయి.

నాకు అత్తమ్మ ప్రవర్తన, మాటలే గుర్తుకొస్తున్నాయి. ఎంతగా నాలో మధనపడినా, ఇప్పుడు పిల్లనో, పిల్లవాడినో కని, సాకి, అవస్థ పడలేననే భయం కమ్ముకుంది మనసుని.

అప్పటికి మా అత్తమామలు వెళ్లిపోయి రెండు నెలలైంది. అమెరికాలో ఆర్థిక మాంద్యం మొదలైంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల విషయంలో అనిశ్చిత స్థితి మొదలైంది. పింక్ స్లిప్ వార్తలు భయాందోళనలు కలిగిస్తున్నై.

ఇటు ఇంట్లో రాజేష్‌కీ, నాకూ మధ్య చిత్రమైన మౌనపోరాటం!

ఆవేళ శనివారం-

రాత్రి- పొద్దుపోయింది.

నేను బెడ్‌మీద అస్థిమితంగా మసలుతున్నాను. రాజేష్ నెమ్మదిగా నా దగ్గరగా జరిగాడు.

"ఇహ మన పరిస్థితి ఇంతేనా?" అంటూ నడుం మీద చేయి వేశాడు. నాకు మనసులో పరిపరి ఆలోచనలు. మాట్లాడలేదు. మరికొంచెం దగ్గరగా కదిలాడు.

"ప్లీజ్ కరుణా, అర్థంచేసుకోటానికి ప్రయత్నించు. ఇంకా లేటయితే నీ ఆరోగ్యానికి అసలు మంచిది కాదు..." అన్నాడు.

రాజేష్ స్వరం మార్దవంగా వుంది.

నా మనసూ, తనువూ వోదార్పుని కోరుకుంటున్నట్టు అప్రయత్నంగా అతని వైపు తిరిగాను. రాజేష్‌లో ఒదిగిపోతూ ఏడ్చేశాను. వెక్కులు పెట్టాను. అతను సాంత్వనగా కన్నీళ్లు తుడిచాడు.

"ఛ... పిచ్చిపిల్లా... ఇప్పుడేం జరిగిందనీ?" అని అనునయించాడు.

ఆ తర్వాత చాలాసేపటికి అలసిపోయిన తనువులూ, మనసులూ కలిసిపోయి సేదదీరాయి.

●

నాకిప్పుడు రెండోనెల ప్రెగ్నెన్సీ!

'కంగ్రాచులేషన్స్' చెప్పి ఆనందంతో ఉక్కిరిబిక్కిరయిపోయాడు రాజేష్.

అత్తమ్మకి చెప్పాడు... ఆమె ఫోన్ చేసింది.

"పోన్లే, ఇప్పటికైనా బుఱ్ఱ తిరిగింది" అంది.

"పురిటికి మీఅమ్మని పిలిపించుకో. ముందే మీవాళ్ళకి చెప్పి వుంచుకో. నీ ఆడపడుచు సరళికి నాలుగో నెల. దానికి అన్నీ నేనే చేయాలి. పైగా రెండో కాన్పు. మనింట్లోనే పోయాలి. రాజేష్‌కి తెలుసులే!" అని ఆ విషయాలే మరో పదిహేను నిముషాలు మాట్లాడింది.

ఇదీ విషయం. ఇక్కడా నా నిర్ణయంతో ఏ ప్రమేయమూ లేదు! తన సూచనని నేను ఆమోదించాలి. అమ్మ రావాలి అమెరికాకి!

ఆ రాత్రి నాకూ, రాజేష్‌కీ మధ్య తర్జనభర్జన.

మర్నాడు ఉదయాన్నే నాన్నకి ఫోన్‌లో చెప్పాడు రాజేష్. అమ్మా, నాన్నా చాలా సంతోషించారు. "పురిటికి అత్తగారు రావలసి వుంటుంది" అని వివరాలు చెప్పాడు.

ఆయన చాలా కూల్‌గా... "చూద్దాంలే రాజేష్. చాలా టైమ్ ఉంది కదా!" అన్నాడు.

రోజులు గడుస్తున్నై.

అమ్మ వోసారి నాతో మాట్లాడుతూ "నాకూ వొంట్లో బాగుండటం లేదు కరుణా! సుగరొచ్చింది కదా... దాన్తో ప్రాబ్లెమ్‌గా ఉంది. ఇప్పుడీ పురుళ్ళూ, గట్రా రొష్టంతా పడలేననిపిస్తోందే!" అన్నది.

అమ్మ రాకపోవచ్చు! నా భయం నాకుంది. రాజేష్‌తో ఆ మాటే అన్నాను– "కానీలే చూద్దాం!" అని ఊరుకున్నాడు.

నా ఆరోగ్యం అంతంగానే వుంది. నీరసం, నిస్సత్తువా.

"బలహీనంగా ఉన్నావ్ జాగ్రత్త!" అని డాక్టర్ సలహా.

ఒకరోజు అబార్షన్ మాటెత్తాను. నా వైపు వింతగా చూశాడు.

"నా మాట నాకప్పగించి సాధిద్దామనా? తప్పించుకుందామనా?" అని నోరు నొక్కేశాడు. ఆ తర్వాతి రోజున ఈ విషయం గుర్తుచేస్తూ "నీ మూర్ఖత్వంతో పిచ్చిచేష్టలు చెయ్యకు!" అన్నాడు.

సందర్భాలు మారుతున్నై కానీ, నా మూర్ఖత్వం మీద రాజేష్ కామెంట్స్ మాత్రం వెల్లువలా దుముకుతూనే ఉన్నై. నేను మాత్రం 'జీర్ణం జీర్ణం' అనుకుని మింగేస్తూ వుండాలి!

నెలలు గడిచిపోతూ, పోతూ– ఐదో నెల వచ్చింది.

మా అత్తమ్మ ఫోన్. అర్జంట్‌గా స్కానింగ్ చేయించుకోమని. రెండు రోజుల కొకసారి హెచ్చరిక. రాజేష్ కూడా 'ఎప్పుడు వెళ్లాం డాక్టర్ దగ్గరికి?' అని అడుగుతూనే వున్నాడు.

నేనీరోజు ఉండలేక ఆవేశంలో అడిగేశాను–

"దీనికి కూడా మీ అమ్మ నిర్ణయమేనా? ప్రెగ్నెన్సీ నాదా, ఆవిడదా? తెలుసుకోవాలా లేదా అనే నిర్ణయం నాదా, ఆమెదా?"

రాజేష్ బాధపడ్డాడు. 'పడితే పడనీ' అనే నా మనసులో మాటల్ని కుమ్మరించేశాను.

పుట్టబోయే శిశువు గురించి నాకంతటి ఆత్రుతా, ఉత్సుకతా లేవు. "మా రెండు వంశాల్లోనూ అందరికీ తొలిచూలు మగపిల్లాడే' అనే మాటని మీ అమ్మ నోట పదే పదే విన్లేక ఛస్తున్నాను..."

వేష్టపడ్డాను. నిలువు గుడ్లేసుకుని చూస్తూ నిలబడిపోయాడు రాజేష్.

నేను నా చివరిమాటనీ అనేశాను– "అందుకని మా రాజేష్‌కీ మగపిల్లాడే కావాలి' అంటుంది మీ అమ్మ! నాకు కాదు. పోనీ మనిద్దరికీ కాదు..."

రాజేష్‌కి కోపమొచ్చింది.

"అన్నీ పెడర్థాలెందుకు లాగుతావ్ కరుణా? ఇవన్నీ సాధారణంగా మనుషులు మాట్లాడుకునే సంగతులు. అందునా ముందుతరం వాళ్ళు. పెద్దావిడ– ఆవిడ భావాలు ఆవిడకుంటై. వదిలెయ్యొచ్చుగా! నీ మూర్ఖత్వం అన్ని సందర్భాల్లోనూ నన్ను ఇబ్బందుల్లోకి తోస్తూ ఉంటుంది. అక్కడ ఆమె ఏడుపూ, ఇక్కడ నీ గొడవ!" అనేసి టకటక కదిలి, ఆఫీస్‌కి వెళ్లిపోయాడు.

నాకు ఉక్రోషం పొంగుకొచ్చింది. మనసు మెలిపెట్టినట్టయింది.

ఇదీ ఇప్పుడు జరిగింది. ఇదీ రాజేష్‌ని ఇబ్బందుల్లోకి తోసేస్తున్న నా మూర్ఖత్వం!

అతని ఇబ్బంది వాళ్ళమ్మ అడిగినట్లు నాకు పుట్టబోయే శిశువు ఆడో, మొగో చెప్పనని కూచోటం! నేనా పరీక్షకి సిద్ధపడకపోవటం! అందునా ఆమె పదే పదే అడిగినా స్పందించకపోవటం! •

ఇదీ అమ్మాకొడుకుల ఇగో! తమ నిర్ణయాన్ని నేను అమలుచేస్తూ పోవాలి. ఆ గర్భస్థ శిశువు 'ఆడపిల్ల' అని తేలితే?! ఊహించలేను. 'ఏం జరుగుతుందో? అమ్మా కొడుకుల చర్యలెలా వుంటాయో?' అదే నిజానికి నా భయం. అందుకే నేనా విషయాన్ని పక్కన బెట్టటం! అది నిశ్చయంగా నా మనసుకు నచ్చని విషయమే!

ఫోన్ మోగితే ఉలిక్కిపడి లేచాను. చూశాను... అత్తమ్మే!

"చెప్పండి..."

"డాక్టర్‌కి చూపించుకున్నావా?"

"ఊహూం..."

గయ్యిన లేచింది- "ఏవిటీ... 'అమ్మా, తల్లీ' అంటుంటే మరీ నెత్తికెక్కి కూచుంటున్నావ్? అంతగా అతితెలివి ఒంటికి మంచిది కాదు!" చికాకూ, దార్ష్టీకం కలగలిపిన హెచ్చరిక.

పావుగంట పైనే మాట్లాడింది. నాకు లోలోపల కసీ, కోపం.

చివరికి- "మీ బుద్ధులే అంత! అమ్మ పోలికే వచ్చింది. ఆవిడగారి వంశమంతా ఆడ మళయాళమేగా. నీకూ అదే రాసిపెట్టుందేమో..." అని ఏవేవో మాట్లాడింది.

నేనింక తమాయించుకోలేకపోయాను-

"అనవసరంగా మా అమ్మ ప్రసక్తెందుకు తెస్తారు? ఎవరి బుద్ధులేవిటో వాళ్ళ పక్కింటివాళ్ళే బాగా చెప్పగలరు!" అని ఫోన్ కట్ చేశాను.

నాకు తెలుసు... రాబోయే ఉప్పెన.

రాత్రికి రాజేష్ మాటల తుఫానూ, విసురు చేష్టల సునామీ విరుచుకుపడతాయి... 'తప్పదు యుద్ధము.'

నాకు తలలో హోరూ... కటకట...'ఈ మనుషులెందుకిట్టా ఉండాలి? నా మనసుకి నచ్చని పనికి ఇన్ని చర్చలూ, ఇంత పట్టుదల ఎందుకు?'

ఎన్నడో మొలిచిన ప్రశ్నలే. మొక్కలుగా ఎదుగుతున్నై!

టైమ్ చూశాను. పదకొండు దాటింది.

రాజేష్ వెళ్లి చాలాసేపయింది. లేచి టీ పెట్టుకు తాగాను.

●

అమ్మా, నాన్నకి ఫోన్ చేసి చెప్పాను... నేను ఇండియాకి ప్రయాణమవుతున్నట్టు.

వివరాలు చెప్పఖర్లేకుండానే తెలుసుకున్నాడు రాజేష్. తాను మాట్లాడేవి మాట్లాడుతూ సాధిస్తూనే వున్నాడు.

"రావణాసురుణ్ణి 'తెలిసిన మూర్ఖుడు' అంటారు. కొంతమంది ఆ బాపతే" అన్నాడు వోసారి. నేనేమీ బదులు చెప్పలేదు.

మరోసారి "మూర్ఖజనుల మనసుల రంజింపలేము అన్నాడో కవి" అన్నాడు.

రోజుకు రెండుసార్లన్నా "తెలిసియు తెలియని నరు దెలుప బ్రహ్మదేవుని వశమే!" అని కోట్ చేస్తూ ఉన్నాడు. మాటలూ, చూపులు గుచ్చుకుంటున్నా, చలనం లేకుండా పూటలు గడుపుతూ ఉన్నాన్నేను.

పళ్లు నూరుతూ, పిడికిళ్ళు బిగిస్తూ ఎయిర్‌పోర్టుకి వచ్చాడు.

"నువ్వేదో ఘనంగా నా మీదా, మా అమ్మ మీదా విజయం సాధించినట్టు ఫీల్ కానఖ్ఖర్లేదు" అన్నాడు.

కళ్ళు విచ్చుకుని చూశాను. రాజేష్ కళ్ళల్లోకి గుచ్చిగుచ్చి చూస్తూ... "నా ఫీలింగ్‌ని కూడా నాకు మిగిల్చారా మీరు?" అన్నాను. నాలో ఏదో నిర్లిప్తత. పేలవంగా నవ్వేను. చెకిన్ కౌంటర్ వైపు అడుగు కదల్చాను.

తలని అదోలా ఊపుతూ నాకేసి చూస్తూ నిలబడిపోయాడతను. లగేజ్ ట్రాలీని తోసుకుంటూ నేను నా నడక వేగాన్ని పెంచాను.

ఎదురుగా అంతా వెలుగుముద్ద! శరీరంలోకి ఏదో విద్యుచ్ఛక్తి ప్రవేశించినట్లయింది!

•

నార్మల్ డెలివరీ!

అంతా సాఫీగా జరిగింది... ఆడపిల్ల!

రాజేష్‌కి ఫోన్ చేశారు నాన్న. మెయిల్ పంపుతాను అన్నాడని చెప్పారు.

ఏడో రోజున– రాజేష్ మెయిల్ చూశాను...

"ఇది నీ నిర్ణయమేగా?! బెస్టాఫ్ లక్. ఆరోగ్యం జాగ్రత్త!' అని మాత్రం ఉంది.

'ఈ సందేశం అర్థం ఏమిటి?' అనిపించింది.

సమాధానం పొందటానికి మూణ్ణెల్లు పట్టింది... ఇప్పుడు– అటు మా అత్తమ్మకీ, ఇటు రాజేష్‌కీ– మా పాప మమత 'మా ఇంటి మహాలక్ష్మి !'

ప్రకృతి ఎప్పుడూ చిత్రవర్ణాల కలనేత కదా!

•

'ఆంధ్రభూమి' దినపత్రిక 'ఆదివారం అనుబంధం'... 9 జనవరి ' 2011 సంచికలో ప్రచురితమైన కథ